# రామన్నకు మద్దతు



మహారాణాప్రతాప్ చిత్రపటం వద్ద సంఘం నాయకులతో కలిసి పూజలు చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 29 : అందరి అభివృద్ధికి కృషి చేస్తామని ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో బొందిలి రాజ్‌పుత్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన దసరా మిలన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా మహారాణాప్రతాప్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రాణాప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం సంఘం సభ్యులకు ఐడీ కార్డులు అందజేశారు. రానున్న ఎన్నికల్లో జోగు రామన్నకు మద్దతు ఉంటుందని సభ్యులు తీర్మానం చేయగా వారికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమప్రాధాన్యతను ఇస్తూ అందరి సంక్షేమం కోసం పాటు పడుతున్నామన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తూ కుటుంబాలతో కలిసి వచ్చి తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బొందిలి రాజ్‌పుత్ సమాజ్ సంఘ భవన నిర్మాణ పనులను ఎన్నికల్లో గెలిచిన తర్వాత పూర్తి చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు విజయ్‌సింగ్, అధ్యక్షుడు స్వదీప్ సింగ్ ఠాకూర్, కార్యదర్శి సతీశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాంతా దిక్షిత్, ప్రధాన కార్యదర్శి పల్లవి, యూత్ విభాగం అధ్యక్షుడు లక్ష్మణ్‌సింగ్, కార్యదర్శి జగత్‌సింగ్ పాల్గొన్నారు.

### సంత్ రవిదాస్ సేవా సమాజ్

ఆదిలాబాద్‌లోని చిల్కూరి లక్ష్మీనగర్‌లో సంత్ రవిదాస్ సేవా సమాజ్ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే జోగు రామన్న హాజరయ్యారు. ముందుగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పూజలు చేశారు. నూతన ఎన్నికైన సమాజ్ సభ్యులను సత్కరించారు. సంఘం అభివృద్ధికి తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజ్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంత్ రవిదాస్ సేవా సమాజ్ అధ్యక్షుడు రఘునాథ్, ప్రధాన కార్యదర్శి దాదారావ్, రఘునాథ్, ఎక్కర్, రాంజీ, రాజు ,కదం, సందీప్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో ఖంపూర్

- మారిన గ్రామ పంచాయతీ రూపురేఖలు
- రూ.2కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



ఖంపూర్ గ్రామంలో వేసిన సీసీరోడ్డు

నార్నూర్, అక్టోబర్ 29 : నార్నూర్ మండలంలోని ఖంపూర్ గ్రామం ప్రగతి బాటలో పయనిస్తున్నది. గ్రామాలు అభివృద్ధి చెందాలని పల్లె ప్రగతిలో భాగంగా సీఎం కేసీఆర్ పంచాయతీలకు నిధులు కేటాయించడంతో రూపు రేఖలు మారి అభివృద్ధి చెందింది. ఖంపూర్ గ్రామంలో 275 కుటుంబాలు ఉండగా, 696 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్, పాలక వర్గం సహకారంతో గ్రామాభివృద్ధికి నడుంబిగించారు. ప్రధాన రహదారికి అందముగ మొక్కలు నాటించారు. శ్మశానవాటికను నిర్మించారు. పల్లెప్రకృతివనంలో సేదాతీర్చేందుకు వసతులు కల్పించారు. రూ.10లక్షతో సీసీ రోడ్డు, రూ.62వేలతో కల్వర్టులు, రూ.6లక్షలతో డ్రైనేజీ నిర్మించి, రూ.4లక్షలతో స్ట్రీట్‌లైట్లు బిగించారు. హరితహారంలో 9వేల మొక్కలు నాటి పెం చుతున్నారు. 9 లక్షలతో ట్రాక్టర్, వాటర్‌ట్యాంక్, ట్రాలీ కొనుగోలు చేశారు. రూ.10లక్షలతో రెండు కమ్యూనిటీ భవనాలు, రూ.కోటి 44 లక్షలతో బీటీరోడ్డు నిర్మించారు. 70లక్షలతో మిషన్‌భగీరథ నీటి ట్యాంకులు, పైపులైన్లు బిగించారు. మన ఊరు-మన బడి ద్వారా పాఠశాల మరమ్మతుకు రూ.22లక్షలు కేటాయించారు. పంచాయతీ భవనానికి రూ.20లక్షలు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. 2018 నుంచి నేటి వరకు గ్రామపంచాయతీ పరిధిలో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో లేని అభివృద్ధి స్వరాష్ట్రంలో కనిపిస్తుంటే గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఖంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

### కలిసికట్టుగా ముందుకెళ్లాం...



పంచాయతీని అభివృద్ధి దిశగా అందరం కలిసికట్టుగా ముందుకెళ్లాం. గతంలో ఎప్పుడు లేని అభివృద్ధి ఈ సర్కారులో కనిపిస్తున్నది. కొన్ని పనులు కొనసాగుతున్నాయి. గతంలోని పరిస్థితి నేడు లేదని గర్వంగా చెబుతున్నాం.

**-సలాం కేశవ్‌రావ్, ఖంపూర్, గ్రామపటేల్**

### గల్లిగల్లీకి సీసీరోడ్లు ..



గతంలో వర్షం కురిస్తే చాలు వీధుల్లో తిరుగ లేని పరిస్థితి. అంతర్గత రోడ్లనీ బురదమయంగా ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మా ఊరుల్లో గల్లీగల్లీకి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. ప్రతి సమస్యను దశల వారీగా తీరుస్తున్నారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

**కాంబ్లే హన్మంత్‌రావ్, మహదాపూర్, గ్రామస్తుడు**

# ఓటరు నమోదుకు రెండు రోజులే గడువు

- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుకు అవకాశం

తాంసి, అక్టోబర్ 29 : ఓటరు నమోదుకు రెండు రోజుల గడువు మాత్రమే మిగిలింది. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారే కాకుండా ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం అక్టోబర్ 4న ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. మండలంలో మొత్తం 13400 ఓట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 30న ఎన్నికల జరుగనున్నాయి. ఓటు శాతం పెంపే లక్ష్యంగా అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు వరకు గడువు ఇచ్చింది. అది ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

### ఇలా తెలుసుకోవచ్చు

ప్రజలు తమకు ఓటు హక్కు ఉందా లేదా అనే వివరాలు తెలుసుకునేందుకు వివిధ రకాల వెబ్ సైట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన వెబ్‌సైట్ www.nsp.in, voters.eci.gov.inతో పాటు రాష్ట్రానికి సంబంధించి www.ceotelangana.nic.in వెబ్‌సైట్ చూసుకోవచ్చు. అంతేకాకుండా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. 1950 నంబర్‌కు ఫోన్ చేసినా ఓటు హక్కు సంబంధించిన సమాచారం ఇస్తారు. కాగా ఓటు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా చిరునామా మార్పునకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. పూర్తి పేరు తొలగింపునకు మాత్రం ఇప్పుడు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి




ఓటు వజ్రాయుధంతో సమానం. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటు హక్కు వినియోగంతో పాటు ఓటరుగా నమోదు చేసుకోవాలని మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. ఇప్పటికే ఓటరుగా నమోదు చేసుకున్న వారు తమ ఓటు హక్కు ఉన్నదో లేదో జాబితా ద్వారా పరిశీలించుకోవాలి. జాబితాలో పేర్లు లేకపోతే విధిగా పేర్లు నమోదు చేసుకోవాలి.

**- లక్ష్మి, తహసీల్దార్, తాంసి**

## దక్షిణ భారత చారిత్రక సదస్సులో జిల్లా వాసి పరిశోధన పత్రం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 29 : తిరువనంతపురంలో జరుగుతున్న దక్షిణ భారత చారిత్రక సదస్సులో నిర్మల్ జిల్లా వాసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అసిస్టెంట్ ప్రొఫెసర్, టీజీవోస్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పీజీరెడ్డి తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. గిరిజనులు, గిరిజనేతరుల దేవాలయాలు, సంస్కృతుల గురించి వివరించారు. బాసర సరస్వతీ దేవాలయం, గోండు జాతి గిరిజనులు ఆరాధించే కేస్లాపూర్ నాగోబా ఆలయం వాస్తుకళ నైపుణ్యాల వైభవం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు చరిత్రకారులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జే భీమారావు, అధ్యాపకులు డా. పీజీరెడ్డిని ప్రశంసించారు.




పరిశోధన పత్రం వివరిస్తున్న పీజీ రెడ్డి



ఆలయం ముందు పూజలు చేస్తున్న గిరిజనులు

## ఇంద్రాదేవికి గిరిజనుల పూజలు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 29 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవికి ఆదివాసులు ఆదివారం దసరా పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి గిరిజనులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇంద్రాదేవి ఆలయ పూజారి చాహకటి సూర్యరావు, భక్తులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలతో నైవేద్యాల తయారీ